
ఒక పల్లె.. రెండు పంచాయతీలు

- మండలాలు రెండు, ఎమ్మెల్యేలు ఇద్దరు, ఎంపీలు ఇద్దరు
- రేషన్‌కు, ఓటింగ్‌కు ఐదారు కిలోమీటర్లు వెళ్లాల్సిందే
- కల్లెంరెడ్డి పల్లెను ఒకే పంచాయతీగా ఏర్పాటు చేయాలని వినతి



రెండు పంచాయతీల్లో విస్తరించి ఉన్న కల్లెంరెడ్డి పల్లె

జూలపల్లి: పచ్చని పంట పొలాలు, స్వచ్ఛమైన గాలి, ఎర్ర మట్టి బోర్లు, ఎదురుగా పెద్దాపూర్ పెద్ద చెరువు నీటితో కళకళలాడే సుందర దృశ్యం సినిమాలో చూస్తున్న సీన్‌లా ఉంటుంది ఆ ప్రాంతం. ఇది జూలపల్లి మండలంలో ఉంటుంది. ఒకే పల్లె అయినా రెండు పంచాయతీల్లో విస్తరించి ఉండడంతో ఆ గ్రామంలో అభివృద్ధి పనులు ఎవరు చేయాలనేది సంశయంగా మారింది. దీంతో గతంలో ఇక్కడకు వచ్చిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఈ గ్రామానికి తారురోడ్డు మంజూరు చేశారు. దీంతో ఈ పల్లెకు రవాణా సౌకర్యం కలిగింది. ఆర్నకొండ, పెద్దాపూర్‌కు వెళ్లే వాహనదారులకు దగ్గరి దారిగా మారింది.

రేషన్ కోసం ఐదారు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిందే..

జూలపల్లి, ధర్మారం మండలాల పరిధిలో ఉన్న ఆ పల్లె పేరు కల్లెంరెడ్డి పల్లె, (కల్లమోని పల్లె)గతంలో శిల్లోని పల్లెగా పిలిచేవారు. పెద్దాపూర్‌కు నాలుగు కిలోమీటర్లు, కమ్మరిఖాన్ పేటకు 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ పల్లెవాసులు, ప్రధానంగా రెడ్లు వ్యవసాయం, ముదిరాజ్‌లకు అనుకూలంగా చెరువు ఉండడంతో చేపల వేట, ఒడ్డెర కులం వారు బండ క్వారీ ఉండడంతో బండ కొట్టి జీవనం సాగించే వారు ఉన్నారు. ఈ ఊరు పూర్తిగా ఎర్రమట్టి బోరుకు ఉండడం ప్రధాన ఆకర్షణగా ఉంటుంది. రెండు గ్రామాల పరిధిలో ఉన్న పల్లెలో ఐదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేశారు. ఇక్కడ నివసించే వారు రేషన్‌కు, ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఐదారు కిలోమీటర్లు వెళ్లి వేయాల్సిందే.

ఈ పల్లెకు ఆనుకుని ఉండే మరో పల్లె గంటలపల్లె ప్రస్తుతం రెండు కిలోమీటర్ల దూరంలో ఉండే అర్నకొండకు అనుబంధంగా ఉంది. ఈ రెండు పల్లెలను కలిపితే గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయవచ్చని ఆయా పల్లెల వాసులు అంటున్నారు. అధికారులు ఈ దిశగా దృష్టి సారించాలని కోరుతున్నారు.

ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేస్తే..

ప్రస్తుతం ఈ పల్లెకు పెద్దాపూర్, కమ్మరిఖాన్‌పేట రెండు పంచాయతీలు. రెండు మండలాలు జూలపల్లి, ధర్మారం. రెండు అసెంబ్లీలు పెద్దపలి, ధర్మపురి. రెండు ఎంపీ స్థానాలు కరీంనగర్, పెద్దపల్లి. రెండు రేషన్‌షాపులు, ఆరోగ్య కేంద్రాలు జూలపల్లి, మేడారం, ఏఎన్‌ఎంలు ఇద్దరు, అంగన్వాడీ కేంద్రాలు రెండు, ఇద్దరు వార్డు సభ్యులు, రెండు వాటర్ ట్యాంకులు. ఇలా ప్రతీది రెండు చొప్పున ఉండడం ఈ పల్లె విశిష్టత. 28 ఇళ్లు పెద్దాపూర్ పరిధిలో ఉండగా, కమ్మరిఖాన్ పేటకు 50 వరకు ఉన్నాయి. పక్కనే గంటలపల్లెలో మరో 25 వరకు ఇళ్లు ఉండి, ఆర్నకొండ పంచాయతీ కింద ఉన్నాయి. ఈ మూడు పల్లెలను కలిపి ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేస్తే పల్లెవాసులకు దూరభారం తప్పడంతో పాటు అభివృద్ధికి బాటలు వేసినట్లు అవుతుందని స్థానికులు అంటున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి



మా పల్లెకు గ్రామ పంచాయతీలు దూరంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పక్కనే ఉన్న గంటలపల్లెను కలుపుకొని నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేస్తే పల్లెవాసుల కష్టాలు తీరుతాయి. అధికారులు ఈ దిశగా చర్యలు తీసుకోవాలి.

– గొడ్డష్ల గంగయ్య, మాజీ వార్డు సభ్యుడు



ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్ మీదుగా సింగరేణి సీహెచ్‌పీ బొగ్గు, ఆర్ఎఫ్‌సీఎల్ యూరియా తరలించేందుకు గూడ్స్ రైళ్లు ప్రతీరోజు పదుల సంఖ్యలో రైళ్లు నడుస్తూ ఉంటాయి. ఆర్ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్ వెళ్లే రైల్వే ట్రాక్ గేట్ ఒకపక్క మొరాయించడంతో వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. సోమవారం ఉదయం పాఠశాలలకు వెళ్లే వాహనాలు, విధులకు వెళ్లేవారు వెళ్తుండగా ఆర్ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్ వైపు ఉన్న గేటు తెరుచుకొని గౌతమినగర్ వైపు ఉన్న గేటు తెరుచుకోకపోవడంతో వాహనదారులు ట్రాక్‌పై చాలాసేపు నిరీక్షించారు. ఈక్రమంలో ట్రైన్ వస్తే ప్రమాదం జరుగుతుందని వాహనదారులు భయపడ్డారు. అనంతరం రైల్వే సిబ్బంది గేటుకు మరమ్మతు చేయడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

క్లుప్తంగా

న్యాయవాదులకు రక్షణ కల్పించాలి



నివాళి అర్పిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

మంథని: న్యాయవాదులపై దాడులు పెరుగుతున్నాయని, తమకు రక్షణ కల్పించాలని మంథని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఎల్ఎన్ హరిబాబు కోరారు. మంథని బార్ అసోసియేషన్ అధ్వర్యంలో సోమవారం హైకోర్టు న్యాయవాద దంపతులు గట్టు వామన్‌రావు, నాగమణి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రఘోత్తం రెడ్డి, కార్యదర్శి ముస్కుల సురేందర్‌రెడ్డి, న్యాయవాదులు సువర్ణ చంద్రశేఖర్, ఎస్.భాస్కర్‌రెడ్డి, చందుపట్ల రమణా కుమార్ రెడ్డి, ఆంజనేయులు, కాచే, ఆర్ల నాగరాజు, శ్రీనాథ్, సతీశ్ పాల్గొన్నారు.

వేసవిలో మొక్కలను సంరక్షించాలి



నర్సరీని పరిశీలిస్తున్న కమిషనర్ నియాజ్

సుల్తానాబాద్: నాటిన మొక్కలతో పాటు నర్సరీలో ఉన్న మొక్కలను సిబ్బంది వేసవికాలంలో సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్ ఆదేశించారు. మండల కేంద్రంలోని నర్సరీని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవుల మనుగడ మొక్కలతోనే సాధ్యమవుతుందన్నారు. వేసవికాలంలో నాటిన మొక్కలకు సిబ్బంది నీరు పోయాలని సూచించారు. ఈనెల 28 వరకు మున్సిపల్ కార్యాలయంలో కులగణన దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు.

బాలల సంరక్షణ అందరి బాధ్యత

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని ఇదులాపూర్ గ్రామంలో ఆదివారం బాలల సంరక్షణపై మహిళా సాధికారత కేంద్ర కోఆర్డినేటర్ దయా అరుణ, బాల సదనం కోఆనికడనేటర్ సీహెచ్ సమత మహిళలకు అవగాహన కల్పించారు. జిల్లాలో అనాథ, తల్లి లేదా తండ్రిని కోల్పోయిన బాలల సంరక్షణ కోసం జిల్లా కేంద్రంలో బాల సదనం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆడపిల్లల సంరక్షణ, మహిళల హక్కులు, బేటీ బచావో బేటీ పడావో, బాల్యవివాహాలు, చైల్డ్ హెల్ప్ లైన్ సేవలు, సఖి సేవలు తదితర అంశాలపై వివరించారు. అంగన్‌వాడీ టీచర్ శారద, ప్రతినిధులు, ఐపీఎస్ బృందం సభ్యురాలు బి.మమత, మహిళలు, గర్భిణులు పాల్గొన్నారు.

రక్తదాతకు సన్మానం



సన్మానిస్తున్న మారుతి

మంథని: మున్సిపల్ పరిధిలోని బోయినపేటకు చెందిన పోతరవేన క్రాంతి ఇప్పటివరకు 49సార్లు రక్తదానం చేశాడు. కాగా సోమవారం మంథని విద్యార్థి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు కొండెల మారుతి ఆధ్వర్యంలో క్రాంతిని సన్మానించారు. ఎలాంటి అపోహలు లేకుండా ప్రతీఒక్కరు రక్తాదానం చేయాలని వారు కోరారు. కొండపాక సత్యప్రకాశ్, బోగోజు శ్రీనివాస్, నారమల్ల కృష్ణ, సబ్బని సంతోష్, మధుకర్‌రెడ్డి ఉన్నారు.

వీధిదీపాలకు మరమ్మతు



పనులు పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ నర్రాశాలపల్లె రోడ్డులోని వీధిదీపాల మరమ్మతు పనులను సోమవారం చేపట్టారు. రోడ్డు పక్కన ఉన్న ఎత్తైన చెట్లు వీధిదీపాల వెలుతురుకు అడ్డుగా ఉన్న క్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి వెంగల బాపు ఆధ్వర్యంలో చెట్లకొమ్మలు తొలగించారు. దీంతో మున్సిపల్ సిబ్బంది వెలగకుండా ఉన్న వీధిదీపాలకు మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ వెంగల పద్మలత మాట్లాడారు. వీధిదీపాల మరమ్మతు విషయంపై మున్సిపల్ అధికారులకు విన్నవించామని జరిగిందని తెలిపారు. లైట్లు బిగించడంపై మున్సిపల్ అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలి



మాట్లాడుతున్న కౌశిక హరి

పాలకుర్తి: సాధ్యంకాని హామీలిచ్చి కాంగ్రెస్ అన్నివర్గాల ప్రజలను మోసం చేసిందని, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, కేశోరాం సిమెంట్ కాంట్రాక్ట్ కార్మికసంఘం అధ్యక్షుడు కౌశికహరి పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం పాలకుర్తి మండలం ఈసాలతక్కళ్లపల్లి గ్రామశివారులోని శ్రీసమ్మక్క–సారలమ్మ గద్దెల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అన్నివర్గాల ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. అధికార కాంగ్రెస్ మూలంగా ప్రస్తుతం గ్రామాల్లో సాగు, తాగునీటికి కొరత ఏర్పడిందని ఆరోపించారు. ఈ సందర్భంగా మహిళలు, యువకులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల మధ్య కేసీఆర్ బర్త్‌డే కేక్ కట్ చేశారు. రామగుండం కార్పొరేటర్ కౌశిక లత, మాజీ ఎంపీపీ ఎర్రం స్వామి, పుట్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లం రాజయ్య, నాయకులు ముల్కల కొమురయ్య, బండి శ్రీనివాస్, చింతకింది సత్యనారాయణ, సందవేన రాజయ్య, బత్తిని సతీశ్, కండె స్వామి, మద్దికుంట శంకర్, మాదాసు శంకర్, మాదాసు అరవింద్, నాగరాజు, కొండ కృష్ణ, జనగామ రాజు పాల్గొన్నారు.

యూత్ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్

పాలకుర్తి: పాలకుర్తి మండల అఖిల భారత యాదవ మహాసభ యూత్ మండల అధ్యక్షుడిగా బసంత్‌నగర్‌కు చెందిన అట్ల శ్రీనివాస్‌యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు అట్ల సాగర్‌యాదవ్ తెలిపారు. బసంత్‌నగర్ యాదవసంఘం భవనంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా బండ కుమార్‌యాదవ్, కొమ్ము శ్రీనివాస్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా బండి సాగర్, కోశాధికారిగా బండ రాజ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. నాయకులు మారం తిరుపతియాదవ్, శిలారపు పర్వతాలు, బత్తిని లక్ష్మణ్, మేకల నర్సయ్య, దారవేని శ్రీనివాస్, పుట్ట రాజేందర్, మల్లెత్తుల శ్రీనివాస్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• సబ్ పోస్టాఫీస్ ఏర్పాటు చేయాలని వినతి

జూలపల్లి: మండల కేంద్రంలోని పదిగ్రామాల ప్రజలకు అవసరమైన సబ్ పోస్టాఫీసు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు బీజేపీ సీనియర్ నాయకులు అమరగాని ప్రదీప్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. కరీంనగర్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డితో కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు.

• ఎంఈవోగా బాధ్యతలు స్వీకరణ

ముత్తారం: మండల విద్యాధికారిగా సోమవారం ఎస్.హరిప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. మంథని మండలం కన్నాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న హరిప్రసాద్‌ను ముత్తారం మండల విద్యాధికారిగా నియమిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు.

• కులగణన సర్వే నమోదుకు ప్రత్యేక కౌంటర్

కాల్వశ్రీరాంపూర్: కులగణన సర్వే నమోదుకు మండల పరిషత్ కారాయలంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో పూర్ణచందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28 వరకు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో సమోదు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టోల్ ఫ్రీ నంబర్ 040–21111111కు కాల్ చేసి ఆన్‌లైన్‌లో సైతం నమోదు చేసుకునే అవకాశం ఉందని ఎంపీడీవో పేర్కొన్నారు.

• కొలనూర్‌లో ఇల్లు దగ్ధం

ఓదెల: మండలంలోని కొలనూర్‌లో మాటూరి స్వర్ణలతకు చెందిన ఇల్లు దగ్ధమైంది. సోమవారం సాయంత్రం అకస్మాత్తుగా మంటలు చెలరేగి పూర్తిగా మంటలు అంటుకున్నాయి. ఇంట్లోని బట్టలు, వస్తువులు, సామన్లు, నిత్యావసరాలు పూర్తిగా కాలిపోయాయని స్థానికులు తెలిపారు. అగ్ని ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. పెద్దపల్లి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

• నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుల్తానాబాద్: పెద్దపల్లి పట్టణంలోని రంగంపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో గల పెద్దపల్లి టౌన్–1 ఫీడర్‌లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో అధికారి తెలిపారు. పెద్దపల్లి పరిధిలో గల శివపురి కాలనీ, భూంనగర్ డౌన్, ఆర్కే గార్డెన్ ఏరియా, ముకుంద రెడ్డి అపార్ట్‌మెంట్ ఏరియాలో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 2:30 గంగల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

• లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం

రామగిరి: లయన్స్ క్లబ్ సెంటినరికాలనీ, రేకుర్తి కంటి ఆసుపత్రి సంయుక్తంగా సోమవారం మండలంలోని కల్వచర్లలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో 150మందికి కంటి పరీక్షలు చేశారు. 65 మందిని ఆపరేషన్ కోసం ఎంపిక చేశారు.

• అక్రమ నిర్మాణాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఓదెల: మండలంలోని కనగర్తిలో సుల్తాబాద్ నుంచి జమ్మికుంటకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డును ఆక్రమించుకొని కొందరు అక్రమంగా భవన నిర్మాణాలు చేపడతున్నారని కనగర్తి మాజీ సర్పంచు తాళ్లపల్లి లక్ష్మణ్ సోమవారం కలెక్టర్ కోయశ్రీహర్షకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామంలో 60ఫీట్ల ఆర్అండ్‌బి రోడ్డును 10 ఫీట్ల వరకు ఆక్రమించుకొని, గ్రామపంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా భవనాలు అక్రమంగా నిర్మిస్తున్నారని ఫిర్యాదులో తెలిపారు. వెంటనే అక్రమ నిర్మాణాలను తొలగించి, వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

• భూనిర్వాసితులకు న్యాయం చేయాలి

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ మల్కాపూర్‌లోని ఎస్సీకాలనీ భూనిర్వాసితులకు న్యాయం చేయాలని సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో చల్లూరి రాజయ్య, నారాయణ, దుర్గం తిరుమల వినతిపత్రం అందించారు. 1995 నాటికి తమ భూములను ఎన్టీపీసీ యాజమాన్యం తీసుకుందన్నారు. కాలనీకి మౌలిక వసతులు కల్పించలేదని వాపోయారు. మల్కాపూర్ ఎస్సీ కాలనీని సందర్శించి న్యాయం చేయాలని కోరారు.

• నూతన కార్యవర్గం

సుల్తానాబాద్: పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం సమావేశమైన అనంతరం ఎంపీవో సమ్మిరెడ్డి సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా రాధ, ప్రధాన కార్యదర్శిగా రాజేశ్‌కుమార్ కోశాధికారిగా సాగర్ ప్రచార కార్యదర్శిగా అభిజిత్, కార్యవర్గ సభ్యులుగా రమేశ్, రవీందర్‌రెడ్డి, మంగారెడ్డి ఆసియాను ఎన్నుకున్నారు.

ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలకు అటానమస్ హోదా



సంబరాలు చేసుకుంటున్న అధ్యాపకులు

సుల్తానాబాద్: పెద్దపల్లి ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలకు జేఎన్‌టీయూ అటానమస్ హోదా ప్రకటించడంపై సోమవారం సంబరాలు జరుపుకున్నారు. కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ మణిగణేశ్ మాట్లాడారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లా ప్రజలకు నాణ్యమైన ఇంజనీరింగ్ విద్య అందించాలనే లక్ష్యంతో కళాశాలను వ్యవస్థాపక చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి స్థాపించారన్నారు. ఏవో సురేశ్, చొప్పరి వంశీ, రాజిరెడ్డి, విభాగాధిపతులు డాక్టర్ నటరాజన్, డాక్టర్ ఆరి ఫరాఫత్, ప్రభాకర్, స్వాతి, డాక్టర్ అంబికా, డాక్టర్ రామ్మోహన్ పాల్గొన్నారు.

సమావేశం విజయవంతం చేయండి

రామగిరి: గోదావరిఖనిలో 23న నిర్వహించనున్న ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం విజయవంతం చేయాలని ఏఐఎఫ్‌టీయూ నాయకులు కోరారు. ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2, ఏపీఏలో సోమవారం గేట్ మీటింగ్ నిర్వహించి మాట్లాడారు. కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలన్న పలు డిమాండ్లతో నిర్వహించనున్న సమావేశం విజయవంతం చేయాలన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు రాయమల్లు, రాములు, రత్నాకుమార్, రామస్వామి, యాకన్న, లింగయ్య పాల్గొన్నారు.

సింగిల్‌విండోల పదవీకాలం పొడిగింపుపై హర్షం



ఎమ్మెల్యే విజయరమణారావును సన్మానిస్తున్న చైర్మన్, పాలకవర్గం సభ్యులు

సుల్తానాబాద్‌రూరల్: సింగిల్ విండోల చైర్మన్, పాలకవర్గం పదవీకాలం పొడిగింపుపై చిన్నకల్వల సొసైటీ చైర్మన్ మోహన్‌రావు, పాలకవర్గం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఎమ్మెల్యే విజయరమణారావును ఎలిగేడు మండలం శివపల్లిలోని ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. సీఈవో రమేశ్‌శర్మ, పాలకవర్గ సభ్యులు ఉన్నారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



పెద్దపల్లిలో రక్తదాన శిబిరం



కమాన్‌పూర్‌లో బియ్యం, సరుకులు పంపిణీ



మంథని: వాటర్ ఫ్రిడ్జ్ అందజేస్తున్న పుట్ట మధు



ఓదెల మల్లన్న ఆలయంలో వేడుకలు

మంథని/రామగుండం/ఎలిగేడు/పెద్దపల్లిరూరల్/జూలపల్లి/కమాన్‌పూర్/కాల్వశ్రీరాంపూర్/రామగిరి/ఓదెల/పాలకుర్తి/యైటింక్లయిన్‌కాలనీ/సుల్తానాబాద్/ముత్తారం/ధర్మారం: జిల్లావ్యాప్తంగా మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రాణత్యాగానికి సైతం వెనుకడాకుండా పోరాటం చేసి 4కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చి ప్రత్యేక రాష్ట్రం సాధించారని కొనియాడారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలో అగ్రస్థానంలో నిలిపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



ధూళికట్టలో రుణాలు మంజూరైన షాపులను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో కాళిందిని

ఎలిగేడు: స్వశక్తి సంఘాల్లోని సంఘ సభ్యులైన మహిళలు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు తీసుకుని యూనిట్లు నెలకొల్పాలని ఆర్థికంగా ఎదుగుతూ తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని పెద్దపల్లి డీఆర్‌డీవో కాళిందిని సూచించారు. మండలంలోని ధూళికట్ట గ్రామంలో సోమవారం ఆమె సందర్శించి గ్రామంలో స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాల రికవరీతోపాటు ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలపై పరిశీలించారు. బ్యాంకు లింకేజీ ద్వారా తీసుకున్న సంఘం సభ్యులు నిర్ణీత సమయంలో రుణాలు చెల్లించాలన్నారు. మహిళా శక్తి కార్యక్రమాల కింద సంఘంలో ఉన్న ప్రతీ సభ్యురాలికి రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు రుణసాయం అందిస్తామన్నారు. రుణం తీసుకున్న ప్రతీఒక్కరు క్రమం తప్పకుండా పొదుపు, అప్పులను చెల్లించాలని సూచించారు. మహిళలు సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలపై వివరించారు. ఏపీఎం సుధాకర్, సీసీలు మల్లేశం, గీస ఆనంద్, జ్యోతి, మండల సమైఖ్య అధ్యక్ష, కార్యదర్శులు, స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్, వీవోఏలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే

ధర్మారం: మండలంలోని రచ్చపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం కిండర్ గార్డెన్ గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సముద్రాల వంశీమోహనాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి పీఎం షేక్ హాజరయ్యారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఈ పాఠశాలలో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థుల విద్యా సంవత్సరం ముగింపు సందర్భంగా గ్రాడ్యుయేషన్ డే ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి పోతు ప్రభాకర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్‌రెడ్డి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రామన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సంకష్టహర చతుర్థి



పూజలో పాల్గొన్న భక్తులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్ కాలనీ శ్రీఅయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి సంకష్టహర చతుర్థి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని గణపతి స్వామి మూలవిరాట్‌కు భక్తులు పంచామృతాలతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణనాథునికి ఇష్టమైన గరిక, ఉండ్రాళ్లు పాయసం నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ఆలయ అర్చకులు అష్టోత్తర శతనామావళి, అర్చన చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం మహా అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.